# తను నమ్మిన దైవం

"శ్రీ..." అని ఉత్తరం మొదలెట్టి, ఆగిపోయింది కమల. ఏమని రాయాలో తోచలేదు. పేరు పెట్టి రాస్తే తప్పేమో? ఏమనుకుంటారు? ఏమీ సంబోధించకుండా రాస్తే, తనకి ఉత్తరం ఎల్లాగ రాయాలో తెలీదని అనుకుంటారేమో? బి.ఏ. పాసయిందన్నమాటే కానీ, కాబోయే భర్తకి ఉత్తరం సక్రమంగా రాయడం చేతకాదు. కొంచెమైనా 'మోడరన్' కాదు అనుకుంటారేమో?

ఏమని ప్రారంభించాలో తర్వాత చూసుకోవచ్చునని, "మీకీ ఉత్తరం రాద్దామా వద్దా అని ఎంతో ఆలోచించి చివరికి రాయాలనే నిశ్చయించుకున్నాను. నేను రాయదలుచుకున్న విషయం మా అమ్మకి అర్థం కాదు. మా నాన్నగారికి లెక్కలేదు. మా అన్నయ్య అవహేళన చేస్తాడు. అన్నీ అర్థం చేసుకుని గొడవచేసే మా అత్తయ్య మాట ఎవరూ వినిపించుకోరు. ఇప్పుడు నేనీ ఉత్తరంలో చెప్పిన ప్రకారం చేయడం మీకు కొంచెం కష్టమే కావచ్చు."

ఇదంతా ఏదో నిగూఢమైన విషయంలాగా అనిపిస్తుంది. "ఆయన ఇదంతా లేని పోని హడావిడి" అనుకోవచ్చు.

చేతిలోని పెన్‌కి కేపు పెట్టేసి, లేచి నిల్చుంది కమల. అసలు తను రాయడమే తప్పు. తన వాళ్లకే నచ్చచెప్పలేనిది, తన మనస్సులోని బాధని చెప్పలేనిది, తాను పరాయి ఆయనకి ఏమి చెప్పుకోగలదు? నలుగురిలో పరువు పోవడమే కాని ఏమీ జరుగదు.

రాసిన కాగితం వేపు నిశ్చలంగా చూస్తూ కూర్చుంది కమల. కొన్ని క్షణాలకి నిట్టూర్చి, చేతి మీద తల ఆన్చి కళ్ళు మూసుకుంది.

"కమలా, ఏం చేస్తున్నావే" అంటూ అన్నయ్య మాట వినబడింది. చటుక్కున డ్రాయరు సొరుగు తెరిచి, అందులో పడేసింది రాసే పాడ్‌ని కమల.

ఈలోగా అన్నయ్య వచ్చేశాడు. "నాన్నగారు వచ్చేశారు. అమ్మ రెడీగా వుంది. నన్ను నా ఫ్రెండ్‌ని ఆ టైలరు దుకాణం ముందు వదిలేసి, మీరు సరాసరి మీ నగల కొట్టుకు వెళ్లి పోవచ్చు. అరె! ఇంకా ఏమిటి ఇల్లాగే వున్నావు? వెర్రి మొహమా? నీ నగలకి పెట్టే డబ్బు నాకిస్తేనా, ప్చ్! ఫారిన్ టూర్ వెళ్లేసి వద్దును".

కమల డ్రాయరు సొరుగుకుండే తాళం తిప్పి, చెవి తీసింది ఇవతలకి. "నేను రెడీయే. చీరె మార్చుకుని వస్తాను" అని గది ఇవతలకి వచ్చింది.

బజారు నుంచి వచ్చిన తర్వాత, శుభలేఖల మీద అడ్రసులు రాయడం పనిలో పడ్డారు అంతా. చూసిన లిస్టులే మళ్ళీ చూస్తూ, ఒకరికిద్దరు ఒకరి పేరే రాస్తూ, నానా గందరగోళంగా వుంది అదంతా. బయట ఆవరణ అంతా దిమ్మిస చేయించి, నీళ్ళు చల్లించారు. వరుసగా వున్నాయి మంచాలు.

మంచం మీద పడుకుంది కమల. నక్షత్రాల వెలుగూ, ఊళ్ళోని దీపాల వల్ల నిండిన మెత్తని కాంతీ కనుపిస్తున్నాయి. ఆకాశంలో, రావి చెట్టు రొద చేస్తోంది.

ఆ మూల వున్న వేప చెట్టు తాతగారు నాటిందట. ఈ ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ వుండేది కాదు. తన చిన్నతనంలో. నాన్న కట్టించారు. మండువా ఇల్లు కాస్తా మారి చక్కని బంగళా తయారైంది. ఇంటికి ముందుండే అరుగుల స్థానే వరండా, పూల మొక్కలు వచ్చాయి. తాతగారుండగా ముందు వసారాలో పెద్ద దీపం బుడ్డీ తగిలించేవారు. అదే ఆ వీధిలోకి పెద్ద దీపం.

తాతయ్యకి అప్పగారొకావిడ వుండేది. ఆవిడ కమలకి లీలగా గుర్తు. పచ్చని ఛాయలో వుండేది.

ఏమిటో, ఎంత వద్దనుకున్నా ఆలోచనలు అటే లాగుతున్నాయి.కమల చెవుల్లో ఏదో రొదగా వుంది. కళ్లముందు ఆవిడ ఆకారం, ఆ సాయంత్రం కనుపిస్తున్నాయి. అత్తయ్యా వాళ్ల మాటలు వినిపిస్తున్నాయి.

తనకి అప్పట్లో ఎనిమిదేళ్ళు. ఆరోజు బాగా చీకటి పడింది. తాతయ్య ఇల్లాగే ఆరుబయట పడుకున్నారు. తను అన్నం తినేసి, తాతయ్యకి ఇనుప అమాందస్తాలో పోక చెక్కలు, ఏలకులు కొదుతోంది. అరుగు మీద కూర్చొని, అల్లా ఆయనకి కొట్టి పెడితే,అడుగున మిగిలిన మెత్తని పొడి తనకి ఇచ్చేవారు ఆయన.

తాతయ్య అప్పగారు తను ఆవిడని 'చిన్నమ్మమ్మా' అనేది. చిన్నమ్మమ్మా, తాతయ్య ఇదే తీరులో కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవారు. ఆ కబుర్లు తనకి నిత్యనూతనంగా, వింతగా వుండేవి. విన్న కొద్దీ తియ్యగా వుండేవి. ఆ కబుర్లు వింటుంటే తన మనస్సులో బలమైన సూత్రంతో బంధింపబడిన వ్యవస్థ గోచరమయ్యేది. ఆ వ్యవస్థలో తానున్నట్లు, ఏదో శాంతిగా వుండేది.

ఆ రాత్రి... పోక చెక్కలు, ఏలకులు కొట్టి తాతయ్య చేతిలో పోసింది తను. ఆ మెత్తని పొడి నోట్లో వేసుకుంది.

"చిన్నమ్మమ్మా! నీకిమ్మంటావా కొంచెం?" అనడిగింది.

"మా అమ్మే! బంగారం, ఎంత ప్రేమమ్మా నీకు?" అని ఆవిడ తీసుకుంది.

"ఒరేయి రాముడూ, మన కామికి ఏడేళ్ళు వెళ్లాయి కదూ?" అన్నదావిడ తాతయ్యతో...

"ఔనమ్మా దీనికి పెళ్లంటే అబ్బాయికి సరిపడదు. చదువు కూడా ముఖ్యమే. కానీ ఏ ఈడు కా ముచ్చట. పెళ్లి విషయమే నేను ఆలోచిస్తున్నాను"

అత్తయ్య పడుకున్నది కాస్తా లేచి కూర్చుంది. "నాన్నగారూ, ఇప్పుడే చెప్పేస్తున్నాను. మన కామికి పెళ్లి మట్టుకు ఈ ఇంట్లో చేసేందుకు వల్ల కాదు" అన్నది.

ఆవిడన్న మాటలు ఇప్పటికీ తనకి స్పష్టంగా జ్ఞాపకమున్నాయి.

ఆవిడా మాట అన్నాక క్షణకాలం నిశ్శబ్దం ఆవరించింది. అందరూ ఒకే విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తుండగా ఆవరించే నిశ్శబ్దత అది.

"అబ్బాయీ!" అని తాతయ్య కేకెట్టారు. నాన్న, అమ్మ కూడా ఒకేసారి వచ్చారు బైటికి.

"ఒరేయి సత్యం! మళ్ళీ కామి పెళ్ళినాటికి నేనుంటాను, వుండకపోతాను. మీ అత్తయ్యకి ఈ ఇంట్లో చేశాం పెళ్ళి. ఆరునెలలు తిరక్కుండా అది మనింటికి వచ్చేసింది. మీ అక్కయ్యకి చేశాం. దాని రాత ఇల్లాగే కాలింది. ఇవన్నీ పట్టించుకోక సుందరం బాబాయి గారి కూతురికి ఇక్కడే పెళ్లి చేశాం... దాని ప్రాణానికే

మోసం వచ్చింది. నాయనా మనకి కలిసి రాదురా ఆడపిల్లల పెళ్ళిళ్ళకి ఈ ఇల్లు..'" నాన్నగారు ఏమన్నారో తనకి గుర్తు రావడం లేదు.

ఇదంతా తనకీనాడు స్పష్టంగా స్మృతిలోకి వస్తోంది. ఎందుకు ఎవరికీ పట్టడం లేదు?

నాన్నగారు, అన్నయ్య లోపల్నించి వచ్చారు. అన్నయ్య రెండు చేతుల్లో రెండు పేము కుర్చీలు పట్టుకొచ్చాడు. "ఏమే కామీ, అల్లా పడుకున్నావు?" అన్నాడు.

కమల మాట్లాడలేదు. కొంచెం సేపయాక కమల పిల్చింది. "అన్నయ్యా! ఒకసారి ఇల్లా రావా?" అని. అన్నయ్య పేము కుర్చీ ఈడ్చుకొని వచ్చాడు.

"అన్నయ్యా! మనకి వూళ్ళో మరో ఇల్లు దొరకదా ఫంక్షన్‌కి?" అన్నది.

"ఏం? ఎందుకు? స్వగృహంలో అని రాసేశాం కదా శుభలేఖలు?" అన్నాడు.

"రాశారంటే అది కాదు. ఈ ఇంట్లోకాక మరెక్కడైనా ఏర్పాటు చేయకూడదూ..."

"ఎందుకు చెప్పమంటుంటే.. ఏం? ఈ ఇల్లు నచ్చదని రాయబారం చేశాడా బావగారు?"

"ఏమిట్రా బావగారంటున్నావు?" అంటూ నాన్నగారు సిగరెట్టు ఆర్పి అవతలపారేసి వచ్చారు.

అన్నయ్య చెప్పక మానడు. "ఈ ఇంట్లో వద్దుట నాన్నగారు. దాని పెళ్ళి. ఎందుకో అడిగితే చెప్పదు బావగారేమైనా కబురు పెట్టారేమోనని."

నాన్నగారు నడుం మీద చేతులు పెట్టుకుని ఒక్క నిముషం నిల్చున్నారు.

"చూడూ, ఆ కుర్చీ ఇల్లా పట్టుకురా" అని. అన్నయ్య పట్టుకొచ్చిన ఆ కుర్చీ తన మంచం దగ్గరికి లాక్కుని కూర్చున్నాడు.

"చూడు కమలా! నీకీ పిచ్చి బాగా పట్టినట్లుందే. అబ్బాయి! ఈ గొడవంతా ఇది చేస్తుందని మీ అమ్మ నాతో అంటూనే వుందిలే. అందుకని ఆవిడ ఒక శాంతి కూడా చేయించింది. ఈ మధ్య దాంతో ఆవిడకు కొంత మనశ్శాంతి వచ్చింది. దీనికి మాత్రం వదల్లేదు. వింటున్నావా అబ్బాయి? మా నాన్న ఎన్నడో ఒకనాడు అన్నాడు 'కమలపెళ్ళి ఈ ఇంట్లో చెయొద్దని'. ఏమిటిట చేస్తే?"

"ఒక ప్రక్కనేమో సాంఘికాచారాలనీ, మూఢనమ్మకాలనీ కబుర్లు. మరో ప్రక్క ఇదిగో, ఆ కాలు ఇటు పెడితే చెరుపు, అటు పెడితే గండం అంటూ వెనుదీయడాలు. ప్లాటుఫారం ఎక్కి కబుర్లు చెప్పడం తేలికేరా! చేసి చూపమను ఎవరికేనా?

"ఇన్నాళ్ళకీ నాడు నా ఇంట్లో నేను వెయ్యి మందికి విస్తర్లేసి అన్నం పెట్టబోతున్నాను. ఆ అన్నదానం తోనే పోతుంది కదూ ఏ దోషమైనా వుంటే? ఇది కూడా నా సొంత ఆలోచన కాదు మీ అమ్మది. శాంతి కావాలంది. చేయించాను. రెండొందలు ఖర్చు పెట్టి భోజనాలంటోంది. సరే వెయ్యి రూపాయలు శాంక్షను. సత్యన్నారాయణ వ్రతంట. ఇంకో రోజు మరో ఐదు వందలు డబ్బుకి లెఖ్ఖలేదు. కానీ ఈ సణుగుడు, ఈ వెనుకతగులాటం వుండకూడదు."

"ఏం కమలా వింటున్నావా? ప్రస్తుతం ఈ ఇంటికి ఏ దోషమూ లేదు. ఉన్నా ఎవరికీ పట్టదు. పట్టినా పట్టించుకోకూడదు."

కమల మాట్లాడలేదు. తన నుంచి జవాబునాశించని ఉపన్యాసం అది. తన మనస్సంతా భారంగా చేసి, తన నరాలలోని బిగువుని సడలింప చేసి, తనకి ఆలోచించే శక్తి బొత్తిగా లేదని తేల్చివేసే ఉపన్యాసం అది. కమల లేచింది.

"ఏమిటి వెళ్ళిపోతున్నావు? చెప్పుమరి?" అన్నాడాయన.

"అల్లాగే నాన్నగారు. దాహం వేస్తోంది నీళ్లు త్రాగి వద్దామని లేచాను" అన్నది.

ఆ రాత్రీ, తరువాత వారం రోజులూ అల్లాగే గడిచాయి.

పెళ్ళినాటికి కమల చాలా హడావుడిలో వుంది. టైలరు బట్టలు తెస్తున్నాడు అనంతంగా. వెండి, బంగారు సామాన్లు జాగ్రత్తలూ, వంట వాళ్ళకి వస్తువులందివ్వడాలూ, డబ్బాలనిండా పిండి వంటలు... చాలా హడావిడిగా వుంది. బంధువులు చాలా వరకు వచ్చేశారు.

ముహుర్తం వేళకి కమలని అందంగా అలంకరించారు. పెండ్లి తంతు అంతా ముగిసింది. అతను తన మెడలో మంగళ సూత్రం ధరింపచేస్తున్న సమయంలో కమల మేను కంపించింది. ఆవేశం గొంతు వరకు వచ్చి ఊపిరాడనీయలేదు. ఆ మరుక్షణం నుంచీ తన శరీరానికి, తన జీవితానికి ఒక అర్ధం, ఒక శోభ వచ్చాయనిపించింది.

తరువాత పదిరోజులకి హడావిడి తగ్గింది. అతనితో వెళ్లిపోవడానికి ఏర్పాట్లు జరుగసాగాయి. పెట్టెలో చీరెలు సర్దుకుంది కమల. డ్రాయరు తీసి, దానిలోని పెన్, తన కాగితాలు, ఉత్తరాలు, సర్టిఫికేట్లున్న కవర్లు, అన్నీ తీసుకుంది. హృదయం భారంగా వుంది. ఆ డ్రాయరు, టేబిలు లైటు, తనా గది దాటిన మరుక్షణం బావురుమంటాయేమో ననిపించింది. డ్రాయరుపై సొరుగు తీస్తుంటే లెటర్ పాడ్ కనుపించింది. అప్రయత్నంగా పై కాగితం చూసింది కమల. తానానాడు మొదలెట్టి, ఆపేసిన ఉత్తరం. ఒక్కసారిగా కమల గుండెలు దడదడలాడాయి. అతను తన మెడలో మంగళ సూత్రం కడుతున్నప్పుడుగానీ, అతనిని తనని జీవితాంతం ఏకం చేసే వివాహమంత్రాలు చెవులలో వినబడుతున్నప్పుడు గానీ ఈ భయంకర విషయం తోచలేదు.

వణికే వ్రేళ్ళతో ఆ కాగితాన్ని పాడ్ లోంచి చింపింది కమల. మడిచి, ముక్కలు చేద్దామనుకుని ఆగిపోయింది. నాలుగు మడతలు వేసి, పెట్టెలో చీరె అడుగున దాచింది.

మాధవరావు వెంట కమల మద్రాసు వెళ్లిపోయింది. వెళ్లిన క్రొత్తలో పగలంతా ఇంట్లో ఒక్కత్తె ఉండ లేనని గొడవ చేసేది కమల. అతను నాల్గురోజులు సెలవు పెట్టి ఇంట్లోనే కూర్చున్నాడు.

రోజూ సాయంత్రం అతను ఇంటికి రాగానే, కళ్లనీళ్లు పెట్టుకుని, 'నేనుండ లేను' అనేది. అతను ఏమీ తోచక తికమక పడేవాడు. మరేం చేస్తుంది ఆమె మాత్రం? అతను వెళ్లినప్పటి నుంచీ ఏమీ బాగుండదు ఆమెకి. రేడియోలో పాటలు, పత్రికలలో కథలు విసుగనిపిస్తాయి. అతనే జ్ఞాపకం వస్తాడు. అతని బట్టలు, అవీ కనిపిస్తే, కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి.

ఓనాడు అన్నయ్య ఉత్తరం వచ్చింది. "ప్రియమైన చెల్లాయిని దీవించి... దీర్ఘసుమంగళీభవ!" అంటూ ఏదో రాశాడు. అమ్మ బెంగ పెట్టుకుందని, ఓ మాటు వచ్చి వెళ్లమని రాశాడు. ఇంటి వేపు మరలాయి ఆలోచనలు కమలకి. అన్నయ్య, నాన్న, అమ్మ! తన వాళ్లు వాళ్లంతా! వాళ్లతో పెన వేసుకుని వున్న తన జీవితం ఇల్లా వేరైపోయింది. అమ్మకి తనంటే ప్రాణం. నాన్నగారికి మాత్రం? అల్లా దబాయిస్తారు గానీ, తనంటే నిజంగా ఎంత ప్రేమ!

అన్నయ్య వుత్తరం మళ్లీ ఓ మారు చదవాలనిపించి తీసింది కమల. 'దీర్ఘ' ఆమె హృదయం వేగంగా కొట్టుకుంది. ఆ రాత్రి జ్ఞాపకం వచ్చింది. ఆ రాత్రి తాననుభవించిన వేదన అంతా మరొక మారు అలముకున్నది ఆమె మనసులో.

కమల ముఖం పాలిపోయింది. ఏమిటి చేయడమిప్పుడు? ఏం చేయగలదు తాను. తన చేతుల్లో ఏమీ లేదిప్పుడు. కమల ఆలోచనలు ఇంతకంటే వివరంగా పోలేదు. అల్లా పోవడం భయంకరం! వివరాలు ఆలోచించడమంటే ఆమె హృదయం బ్రద్దలవుతుంది.

ఇల్లంతా తిరిగింది కమల. బైటికి వచ్చి, వీధి తలుపు తీసి, మొక్కలవంక చూసింది. వణికే వ్రేళ్లతో చెట్ల ఆకులని స్పృశించింది. మళ్లీ ఇంట్లోకి వెళ్లి ఏదైనా పని చేసుకుందామని మొదలెట్టింది.

ఏమీ సాగదు. ఊపిరాడని ఆవేశం, ఆరాటం. నిస్సహాయంగా మంచం మీద పడుకుని ఏడ్చింది.

బయట కాల్ బెల్ మోగింది. కళ్లు తుడుచుకుని, అద్దంలో చూచుకుని బైటికి వెళ్లి తలుపు తీసింది. మాధవరావు వచ్చేశాడు. పుస్తకాలు టేబిలు మీద పెట్టి, కమల వంక చూసి నవ్వాడు. సోఫాలో కూర్చుని "రా, ఇల్లా కూర్చో" అన్నాడు.

"లేదు, పనుంది" అని ఆమె లోపలికి వచ్చింది. వచ్చి వంటింట్లో డబ్బాలు సవరించసాగింది. అతను వెనుకే వచ్చాడు.

తన వేపు త్రిప్పుకుని, చేతులు పట్టుకుని, "నువ్వు డబ్బాలు ఇప్పుడు సర్దనక్కరలేదు రా" అని హాల్లోకి తీసుకెళ్లి సోఫాలో కూర్చో పెట్టాడు.

"తోక చుక్కలాగా ఆ బొట్టేమిటి" అన్నాడు.

"పడుకుని లేచాను. చెదిరింది కాబోలు" అని సవరించుకుని వస్తానన్నట్లు లేచిందామె.

"ఫరవాలేదు చెప్పు. ఏమైందో చెప్పు"

"ఏం లేదు"

"ఏం లేకపోతే ఎందుకేడ్చావు?"

"ఏం లేదు"

"అదేమిటి? పోర్షను మర్చిపోయిందానిలా?" కమలకి నవ్వొచ్చింది. మబ్బులోంచి ఎండలాగా.

"చెప్పు. చెప్పకపోతే నా మీద ఒట్టే" అన్నాడతను.

బావురుమన్నది కమల. అతను తల నిమిరి సముదాయించాడు. "చెప్పు మరి. బాధ తీరిపోతుంది" అన్నాడు.

"నేను ఉత్త పాపిష్టిదాన్నండీ" అని మళ్లా ఏడ్చింది కమల. ఆమెకి ఆపుకోలేని దు:ఖం వస్తోంది. ఆ దుఖంలోనే చెప్పింది ఆమె తనను వేధించే ఆ విషయం. చెప్పడానికే భయపడే ఆ విషయం అనుకోవడానికే వణికిపోయే ఆవిషయం చెప్పింది. చూచాయగా చెప్పింది.

మాధవరావు ఆమె కళ్లు తుడిచాడు. "ఇంతేనా" కొంత వరకు ఉపశమించిన దు:ఖంతో తలూపింది ఆమె.

"చూడు ఇట్లాంటివన్నీ పట్టించుకోకూడదు!"

"మీకర్థం కాదు నా బాధ" అన్నది.

బయట మళ్లీ కాలింగ్ బెల్ మోగింది. ఎవరో వచ్చారు. మాధవరావు వెళ్లి తలుపు తీశాడు. అతని స్నేహితులెవరో వచ్చారు. కమల చటుక్కున లోపలికి వచ్చేసింది.

ఒక అరగంటకి గానీ స్నేహితులు వెళ్లలేదు. వాళ్లు వెళ్లిన తర్వాత కూడా, చాలా సేపటి వరకు మాధవరావు అలికిడి కాకపోయేసరికి కమల డ్రాయింగు రూంలోకి వెళ్లింది. మాధవరావు చేతిలో ఏదో పుస్తకం వుంది. కాని అతను తన ఎదురుగా వున్న గోడ వేపు చూస్తున్నాడు ఆలోచిస్తున్నట్లుగా.

కమల అడుగుల అలికిడి అయ్యేసరికి, ఉలిక్కిపడి కమలను చూసి నవ్వాడు. "రా కూర్చో" అన్నాడు.

"చూడు కమలా! నువ్వు బాధ పడడం మానేయొచ్చు" ఇంక మీద. మీ నాన్నగారు నాకీ విషయం

మొదట్లోనే చెప్పారు. ఏదో మాటల సందర్భంలో. పూర్వం మండువాలో మండపం వేశారుట మీ వాళ్ళంతా. మన పెళ్లి ఇవతల ముందు వాకిట్లో గడిచింది. ఆ మండువా సావిట్లో మండపం వేయకపోతే చాలునని, ఏదోషం ఉండదని సిద్ధాంతి గారు చెప్పారని మీ నాన్నగారు చెప్పారు. పిచ్చి పిల్లా నిన్నింతగా ఆ సంగతి బాధిస్తోందని తెలిస్తే అప్పుడే చెబుదును గదా. ఏమిటి? చూడు  చూడాలి మరి. నాది గట్టి ఆయువు. భయపడకు" అన్నాడతను.

కమల మాట్లాడలేదు. ఆమె గడ్డం పట్టుకుని ముఖం ఎత్తి చూస్తే, ఆ కళ్లల్లో మిలమిల కనుపిస్తోందని, సావిత్రి లాగా భర్తను గెలుచుకున్న విజయ గర్వం కనిపిస్తుందనీ.. నాన్నగారు తన బాధ గ్రహించి, సిద్ధాంతి గారి నడిగి ఆ విషయం స్పష్టం చేసుకున్నారు. ఆయనకి తనంటే ఎంత ప్రేమో అన్న ఆలోచనలన్నీ ఆ నల్లని  కనుపాపలలో పొంచి వుంటాయని మాధవరావుకి తెలుసు.

కాని అతను సగం రాసిన ఆ వుత్తరం చూసి వుంటాడనీ, ఆమె మనశ్శాంతి కోసం అబద్ధం ఆడుతున్నాడేమోనని సందేహాలు మాత్రం ఛాయామాత్రంగానైనా ఆ కళ్లల్లో  వుండవని కూడా అతనికి తెలుసు.

**- యువ జులై 1960**